సాక్షి
ఆదిలాబాద్

శనివారం । 9 । ఆగస్టు । 2025

సెల్ఫీ విత్ రాఖీ



అన్నాచెల్లెలు.. అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ ఎప్పటికీ చిత్రమై నిలిచేలా 'సాక్షి' అవకాశం కల్పిస్తోంది. అక్కాచెల్లెళ్లు రాఖీ కట్టినప్పుడు సెల్ఫీ ఫొటో దిగి శనివారం వాట్సాప్ చేయండి. మీ పేరు, గ్రామం/పట్టణం, మండలం వివరాలు పంపించాలి. ఉత్తమమైన వాటిని సాక్షి దినపత్రికలో ప్రచురిస్తాం.

పంపించాల్సిన నంబరు 97054 44328

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

ఆదిలాబాద్ నుంచి అమరావతికి బస్సు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ నుంచి యవత్‌మాల్ మీదుగా అమరావతి (మహారాష్ట్ర) వెళ్లడానికి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సర్వీస్ ప్రారంభించినట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సు ఆదిలాబాద్ నుంచి ఉదయం 8.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.30 గంటలకు అమరావతికి చేరుకుంటుందని తెలిపారు. అమరావతి నుంచి 2.15 గంటలకు బయలుదేరి ఆదిలాబాద్‌కు సాయంత్రం 7.15 గంటలకు తిరిగి చేరుకుంటుందని వివరించారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

ఆదిలాబాద్‌టౌన్: తాంసి మండల కేంద్రంలోని జెడ్పీఎస్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కీర్తిరాజ్ గీతేశ్వర్‌ను కలెక్టర్ రాజర్షిషా ఆదేశాల మేరకు విద్యాశాఖ అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. సదరు ఉపాధ్యాయుడు విద్యార్థినిలపై వేధింపులకు పాల్పడుతున్నాడని ఇటీవల తాంసి పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో ఆయనను సస్పెండ్ చేశారు.

షీటీమ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఆదిలాబాద్‌టౌన్: షీటీమ్‌లు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఉపాధ్యాయులపై పోక్సో కేసులు నమోదు చేస్తున్నారని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్ము కృష్ణకుమార్, నారాయణ స్వామి అన్నారు. ఈమేరకు కలెక్టర్ రాజర్షిషాను శుక్రవారం కలిసిఫిర్యాదు చేశారు. షీటీమ్ అవగాహన తరగతులతో విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై ఉపాధ్యాయులపై కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. ఎస్పీ వద్ద మెప్పు పొందేందుకు ఇలా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ చర్యలతో సమాజంలో ఉపాధ్యాయులపై నమ్మకం కోల్పోయే విధంగా, భార్య భర్తల మధ్య మనస్పర్థలు వచ్చి తమ పిల్లల ఎదుట చులకనభావానికి గురై అఘాయిత్యానికి పాల్పడే అవకాశం ఉందని తెలిపారు. ఇటీవల ఓ పాఠశాల ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని, మరుసటి రోజు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి తమ ఉపాధ్యాయుడు తప్పు చేయలేదని రోడ్డుపైకి వచ్చారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధులు నిర్వహించడం కష్టతరమవుతుందని పేర్కొన్నారు. దీంతో నాణ్యమైన విద్య అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ



కాంస్య పతకాలు నెగ్గిన తరుణ్, సతీశ్

ఆదిలాబాద్: ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వేదికగా ఈనెల 7న పోటీలు ప్రారంభం కాగా, ఆసియా యూత్ జూడో చాంపియన్‌షిప్ పోటీలకు సంబంధించి జాతీయస్థాయి ఓపెన్ సెలక్షన్ ట్రయల్స్‌లో లావూరి సతీశ్, రమావత్ తరుణ్ అనే జూడోకాలు కాంస్య పతకాలతో మెరిశారు. మైనస్ 50 కేజీల విభాగంలో సతీశ్, మైనస్ 55 కేజీల విభాగంలో తరుణ్ మూడో స్థానంలో నిలిచినట్లు జూడో కోచ్ రాజు తెలిపారు. వీరిని డీవైఎస్‌వో శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలి

కైలాస్‌నగర్: 1–19 ఏళ్లలోపు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఈనెల 11న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమ నిర్వహణపై శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు తమ పరిధిలోని విద్యార్థులకు మాత్రలు వేయించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నులిపురుగులు ఉన్నట్లయితే పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, ఆకలి మందగించడం వంటి ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయన్నారు. చదువుపై ఏకాగ్రత కోల్పోయే అవకాశముందన్నారు. వసతీగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ మాత్రలు అందుబాటులో ఉన్నాయని పిల్లలందరికి తప్పకుండా ఇప్పించాలన్నారు. జిల్లాలో నిర్దేశిత వయస్సు గల పిల్లలు 2,06,127 మంది ఉన్నారని తెలిపారు. అనంతరం జాతీయ నులి పురుగుల దినోత్సవ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఇందులో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, అదనపు డీఎంహెచ్‌వో మనోహర్, డీఐవో వైసీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజు, బీసీ సంక్షేమాధికారి రాజలింగు, డీపీవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్ మండలకేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలోగల కొత్తపల్లి గిరిజనుల దారి కష్టాలకు నిదర్శనం ఈ చిత్రం. మండలకేంద్రంలో నిర్వహించే వార సంతకు గురువారం వెళ్లి వస్తున్న క్రమంలో వాగు ఒక్కసారిగా ఉప్పొంగింది. ప్రవాహం తగ్గాక ఇలా నెత్తిన సామగ్రితో వాగు దాటుతున్న గ్రామస్తుల దీనావస్థ ఇది.



ఉట్నూర్ మండలం వంకతుమ్మ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళలు ఉట్నూర్‌లో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి ఇలా గ్రామానికి తిరిగిరావడం నిత్యకృత్యం. అలాగే ఈ గ్రామానికి చేరుకోవాలంటే మధ్యలో వాగు దాటాల్సిందే. అత్యవసర పరిస్థితుల్లో వీరిది దయనీయ పరిస్థితి. 2013లో జరిగిన రెండు ఘటనలు ఇప్పటికీ ఆ గ్రామస్తులు మరిచిపోలేరు. ఓ నిండు గర్భిణికి పురుటినొప్పులు రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లే క్రమంలో వాగు దాటడం ఆలస్యం కావడంతో ఆమె మృత్యువాత పడింది. అదే ఏడాది పాము కాటుకు గురైన మారు తిని ఆస్పత్రికి తీసుకెళ్లే సమయంలో వాగు ఉప్పొంగిన క్రమంలో ఆయన మృతిచెందాడు.



నార్నూర్ మండలంలోని మల్లెంగి గ్రామపంచాయతీ పరిధిలోని బారిక్‌రావు గూడ ఇది. వంద ఆదివాసీ గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం లేదు. వాగు దాటితేనే ఊరు చేరుకునేది. వర్షాకాలంలో ఇది ఉప్పొంగితే గ్రామస్తులు బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సిన దుస్థితి. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఇప్పటికీ అందని పరిస్థితి.

మారని బతుకులు

- ఆదివాసీల జీవితాల్లో వెలుగేది..?
- 'గిరి' గ్రామాలకు సౌకర్యాలు కరువు
- రోడ్లు లేవు.. వైద్యసేవలకూ తిప్పలే
- విద్యావకాశాలు అందిపుచ్చుకోని వైనం
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఇదీ ఆదివాసీల బతుకుచిత్రం. తరాలు మారుతున్నా వారి తలరాత మారడం లేదు. ఇందులో ఉట్నూర్ మండలంలోని వంకతుమ్మ గ్రామం ఐదు దశాబ్దాల క్రితం, నార్నూర్ మండలంలోని బారిక్‌రావుగూడ నాలుగు దశాబ్దాల క్రితం, ఇంద్రవెల్లి మండలంలోని మామిడిగూడ 35 ఏళ్ల క్రితం ఏర్పడ్డవే. వంకతుమ్మ గ్రామం ఐటీడీఏ కొలువున్న ఉట్నూర్‌కు కేవలం 10 కిలోమీటర్ల దూరంలోనే ఉండటం గమనార్హం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇలాంటి దుస్థితిలో అనేక ఆదివాసీ గ్రామాలు కనిపిస్తాయి. నేటికీ కనీస వసతులకు దూరంగా గిరిపుత్రులు దుర్భర జీవనం గడుపుతున్నారు. తాగునీటికీ తల్లడిల్లే గూడేలు, దారి సౌకర్యం కురువై వైద్య సేవలకు తప్పని ఇక్కట్లు వీరికి షరా మామూలే. ఓ వైపు దేశం సాంకేతికంగా దూసుకుపోతున్నా ఇంకా విద్యుత్ సౌకర్యం లేని గిరి గ్రామాలు సైతం ఉన్నాయి. అడవులను నమ్ముకొని జీవిస్తున్న ఆదివాసీలు ప్రధానంగా పోడు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారు. అధికారులు అందరికీ పట్టాలిచ్చామని చెబుతున్నా ఇంకా పట్టాలు రాని వారు పోరాడుతూనే ఉండడం గమనార్హం. – సాక్షి, ఆదిలాబాద్



ఆదిలాబాద్‌రూరల్ మండలం అంకాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బుర్కి ఆదివాసీ గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేదు. చిన్నపాటి మొరం దారి గుండానే రాకపోకలు సాగించాల్సి వస్తుంది. వర్షాకాలంలో వీరి అవస్థలు వర్ణనాతీతం. పెళ్లి అయినా సరే నడుచుకుంటే వెళ్లాల్సింది. కాగా, గత గవర్నర్ తమిళిసై ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. ప్రస్తుత గవర్నర్ జిష్ణుదేవ్ గ్రామ సమస్యలపై దృష్టి సారిస్తున్నారు. అయినా పరిస్థితిలో మార్పు రాకపోవడం గమనార్హం.

ఆదివాసీ జనాభా (ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో)

గోండు	2,63,515
కొలాం	38,176
కోయ, ఇతరులు	30,739
పర్ధాన్	26,029
మన్నెవార్	15,370
నాయక్‌పోడ్	5,206
ఎరుకుల	1,735
మొత్తం	3,83,001

షెడ్యూల్డ్ మండలాలు (ఉమ్మడి జిల్లాలో)

పూర్తి షెడ్యూల్డ్ మండలాలు : 07
గాదిగూడ, ఇంద్రవెల్లి, నార్నూర్, ఉట్నూర్, జైనూర్, లింగాపూర్, సిర్పూర్(యూ)
మిగతావి : పాక్షిక, నాన్ షెడ్యూల్డ్ మండలాలు

పోడు భూముల వివరాలు.. (ఉమ్మడి జిల్లాలో)

విస్తీర్ణం	2,12,256ఎకరాలు
రైతుల సంఖ్య	66,839
పట్టాలున్న రైతులు	66,839

ఇంకెన్నేళ్లు కావాలి



మా గ్రామం ఏర్పడి యాభై ఏండ్లు దాటింది. ఇంకెన్నేళ్లయితే మాకు సౌకర్యాలు కల్పిస్తారో అధికారులే చెప్పాలి. రోడ్డు నిర్మించాలని, వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని, గ్రామానికి త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని చెప్పి చెప్పి విసిగెత్తిపోయాం. మా ప్రాణాలు పోతున్నా పాలకులు, అధికారులకు పట్టింపు లేదు.
– రుకుదేవ్, వంకతుమ్మ గ్రామం

వంతెన నిర్మించాలి



మా గ్రామానికి వెళ్లాలంటే వాగు దాటాల్సిందే. వంతెన లేకపోవడంతో తిప్పలు తప్పడం లేదు. ఊరిలో ఎవరికైనా సుస్తి అయితే వాగు దాటి వెళ్లడం ఇబ్బందికరమే. వైద్య సిబ్బంది మా ఊరికి రావాలన్నా కష్టాలు తప్పడం లేదు.
– మడావి లచ్చు, గ్రామపటేల్, బారిక్‌రావుగూడ

ఏటా ఇదే గోస



ఎప్పుడో నిధులు మంజూరైనప్పటికీ ఇప్పటికి రోడ్డు మార్గం ఏర్పడలేదు. వంతెన నిర్మించలేదు. గూడ నుంచి బయటకు వెళ్లాలంటే తిప్పలవుతున్నది. మా దుస్థితి ఎవరికి రావద్దు. ఏటా మాది ఇదే గోస.
– జంగుబాపు, మామిడిగూడ

ఐటీడీఏ ఆశయం నెరవేరేనా..



సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ కార్యాలయం ఉట్నూర్‌లో ఉంది. ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమ ఆశయంతో కేంద్ర ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 1975 ఆగస్టు 1న ఏర్పాటు చేశారు. అయితే ఐటీడీఏ ఏర్పడి దశాబ్దాలు దాటుతున్నా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలుకు కృషి జరగడం లేదన్న అభిప్రాయం ఆదివాసీలు, గిరిజనుల్లో ఉంది.

సోదరా.. ఎప్పటిఖీ

రాఖీ.. సోదరీసోదరీమణుల అనుబంధానికి ప్రతీక. లోకం వీడిన తమ్ముడిని విగ్రహరూపంలో స్మరించుకుంటున్న అక్కాచెల్లెళ్లు ఇద్దరైతే.. పండుగకు ఏటా చెల్లి చెంతకే వస్తున్న అన్న మరొకరు.. పుష్కర కాలం తర్వాత విదేశం నుంచి పుట్టింటికి చేరి ఆత్మీయతను చాటిన సోదరి ఇంకొకరు.. నేడు రక్షాబంధన్ సందర్భంగా వారిపై ప్రత్యేక కథనం.

లోకం విడిచినా.. వీడని బంధం



తమ్ముడి విగ్రహానికి రాఖీ కడుతున్న అక్కాచెల్లెలు

తాంసి: తమ్ముడు లోకం విడిచి వెళ్లినా.. 18 ఏళ్లుగా సోదరుడి విగ్రహానికి రాఖీ కడుతూ ప్రేమానురాగాలు చాటుతున్నారు ఈ అక్కాచెల్లెలు. తాంసి మండల కేంద్రానికి చెందిన రమ, రాజమణి సోదరుడు కేశవ్ 2007లో సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. నాడు తమ పంట చేనులోనే అతడి దహన సంస్కారాలు నిర్వహించారు. అయితే తమ్ముడిపై ఉన్న ప్రేమతో అక్కడే విగ్రహం ఏర్పాటు చేశారు ఈ అక్కాచెల్లెలు. ఏటా పండుగ రోజున కేశవ్ విగ్రహానికి రాఖీ కట్టడం ఆనవాయితీగా పాటిస్తున్నారు. తమ్ముడు భౌతికంగా లేకున్నా తాము బతికే ఉన్నట్లుగా భావించి ఏటా రాఖీ కడుతున్నామని చెబుతున్నారు రమ, రాజమణి.

ఆస్ట్రేలియా నుంచి అన్నదమ్ముల కోసం..



అన్నదమ్ములకు రాఖీ కడుతున్న రోజా రాణి

ఆదిలాబాద్: ఆదిలాబాద్‌లోని టీచర్స్ కాలనీకి చెందిన భూసాని రోజారాణి – భూసాని కళ్యాణ్ వర్మ దంపతులు ఉద్యోగరీత్యా ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు. వీరి పిల్లల చదువులు, వారు చిన్నవారు కావడంతో 12ఏళ్ల నుంచి రాఖీకి రాలేకపోయానని అంటున్నారు రోజారాణి. సోదరులు బ్రహ్మరౌతు ప్రేమ్ కుమార్, ప్రవీణ్, చిన్నాన కొడుకు శివమణికి ఏటా ఆన్‌లైన్ ద్వారా రాఖీలు పంపుతుంటే కళ్లలో నీళ్లు తిరి గేవని చెబుతున్నారు. అయితే పిల్లలు పెద్దవడంతో అన్నదమ్ములకు రాఖీ కట్టే అదృష్టం మళ్లీ ఇన్నాళ్లకు వచ్చినందుకు సంతోషంగా ఉందని అంటున్నారు ఈమె. ఇక ఏటా పండుగకు వస్తానని చెబుతున్నారు.

ఏటా చెల్లి దగ్గరికే వచ్చి...



అన్నదమ్ములతో శాంత

ఆదిలాబాద్: రక్షాబంధన్ పండుగ వస్తే సాధారణంగా సోదరీమణులు తమ సోదరులను వెతుక్కుంటూ వెళ్లి రాఖీ కడుతారు. అయితే ఇందుకు భిన్నంగా ఆసిఫాబాద్‌లో ఇరిగేషన్ శాఖలో ఉద్యోగిగా విధులు నిర్వర్తించే గెడం జయంత్ కుమార్ పండుగ రోజు తన చెల్లి ఇంటికి వెళ్లి రాఖీ కట్టించుకుంటాడు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన శాంత ఎఫ్‌బీవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఈమెకు ముగ్గురు అన్నదమ్ములు కాగా, పెద్ద అన్న జయంత్ కుమార్, తమ్ముళ్లు వెంకటేశ్, విలాస్‌కు ఏటా రాఖీ కట్టి మురిసిపోతారు.

ఆరోగ్యకర జీవనమే లక్ష్యం

- కలెక్టర్ రాజర్షి షా
- 'ఆరోగ్య పాఠశాల'పై సమీక్ష

కైలాస్‌నగర్: విద్యార్థుల్లో ఆరోగ్యంపై చైతన్యం పెంపొందించడంతో పాటు, సమాజంలో ఆరోగ్య సంస్కృతి కలిగించేందుకు స్టూడెంట్ చాంపియన్లు మార్గదర్శకంగా నిలుస్తారని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆరోగ్య పాఠశాల రెండో విడత అమలుపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో హెచ్ఎంలు, స్టూడెంట్ చాంపియన్ విద్యార్థులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. విద్యార్థులు ఆరోగ్యంపై నిర్వహించిన పలుప్రదర్శనలను పరిశీలించారు. స్టూడెంట్ చాంపియన్లుగా ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి పెంపొందించేందు కోసమే ఆరు సూత్రాలతో ఆరోగ్య పాఠశాల కార్యక్రమం అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సమన్వయకర్తలకు అభినందనలు తెలిపారు. ఇందులో విద్యాశాఖఅధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీఐఈవో జాదవ్ గణేశ్‌కుమార్, సెక్టోరియల్ అధికారులు, 18 మండలాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు కలెక్టర్‌కు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లా ప్రజలు రక్షాబంధన్ ను ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న విద్యార్థిని

ఆంగ్ల కథలు రాసిన 'సర్కారు' విద్యార్థులు

జిల్లాలోని ఇంద్రవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆంగ్లకథలను రచించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు అరుణ ప్రోత్సాహంతో పదో తరగతి విద్యార్థులు నాగచైతన్య, వందన చెరొక ఆంగ్ల కథల పుస్తకాలు రచించగా వాటిని కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ఆవిష్కరించారు. వారి ప్రతిభను ప్రశంసి ప్రత్యేకంగా అభినందించారు.

అక్రమ అసెస్‌మెంట్లకు చెక్



ప్రస్తుతం కేవలం సిబ్బందితోనే దర్శనమిస్తున్న బల్దియా రెవెన్యూ విభాగం

- పోలీస్ బాస్ చర్యల ప్రభావం
- నిలిచిన అసెస్‌మెంట్ల ప్రక్రియ
- బోసిపోతున్న బల్దియా రెవెన్యూ విభాగం

వివరాలు..

మున్సిపల్ పరిధిలోని వార్డులు	49
ఏటా జరిగే అసెస్‌మెంట్లు	500 – 600
నాలుగు నెలల్లో అసెస్‌మెంట్లు	40

కై లాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో అక్రమ అసెస్‌మెంట్లకు చెక్ పడినట్లేనా అనే చర్చ సాగుతుంది. ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక దృష్టి సారించడంతో అక్రమార్కుల్లో వణుకు మొదలైంది. గడిచిన నాలుగు నెలల వ్యవధిలో వాటి సంఖ్య గణనీయంగా తగ్గడమే ఇందుకు నిదర్శనం.

ఇదీ పరిస్థితి...

పట్టణంలో నాలుగు నెలల క్రితం వరకు అసెస్‌మెంట్ల ప్రక్రియ పెద్ద ఎత్తున సాగేది. మున్సిపల్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, కేఆర్‌కే, 170 సర్వే నంబర్, బంగారుగూడ, ఖుర్షాపూర్, దుర్గానగర్ వంటి తదితర కాలనీల్లో ప్రభుత్వ, అసైన్డ్ స్థలాలు ఉండటంతో అక్రమార్కులు వాటిపై కన్నేశారు. పలువురు మాజీ కౌన్సిలర్లు, వారి కుటుంబీకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు బల్దియాలోని కొంతమంది అధికారులు, సిబ్బంది సహకారంతో వాటిని హస్తగతం చేసుకోవడంపై దృష్టి సారించారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు ఎవరిదో ఒకరిది ఆధార్‌కార్డు తీసుకువచ్చి, గుడిసెలు వేసినట్లు, ఇంటి నిర్మాణాలు జరిగినట్లుగా తప్పుడు ఫొటోలు జత చేసి అసెస్‌మెంట్ కోసం దరఖాస్తు చేసుకునేవారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించాల్సిన బల్దియా రెవెన్యూ సిబ్బంది 'మామూలు'గా వ్యవహరించి అసెస్‌మెంట్ నంబర్లు కేటాయించేవారు. అక్రమార్కులు వాటిని ఆధారంగా చేసుకుని ఆ ప్లాట్ల రిజిస్ట్రేషన్ తంతు పూర్తి చేసేవారు. అనంతరం వాటిని అమాయకులకు విక్రయిస్తూ లక్షలాది రూపాయలు ఆర్జించారు. అయితే ఈ అక్రమార్కులపై పోలీసులు ఇటీవల కేసులు నమోదు చేయడంతో పాటు కటకటాల్లోకి పంపుతుండడంతో మిగతా వారిలో వణుకు మొదలైంది.

పోలీసుల చర్యలతో వెలవెల..

అక్రమ అసెస్‌మెంట్ దందాపై ప్రత్యేక దృష్టి సారించిన ఎస్పీ అఖిల్ మహాజన్ అక్రమార్కులపై కొరడా ఝుళిపించారు. కేసుల నమోదుతో పాటు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తుండడంతో మిగతా వారు జంకుతున్నారు. పోలీసుల చర్యలకు ముందు నెలలో కనీసం 40 అసెస్‌మెంట్లు జరిగేవని బల్దియా అధికారులు చెబుతున్నారు. గడిచిన నాలుగు నెలల వ్యవధిలో కేవలం 40 మాత్రమే కావడం గమనార్హం. ప్రస్తుతం ప్లాటు, వాటికి సంబంధించిన పత్రాలు కలిగి ఉండి ఇంటి నిర్మాణాలు చేస్తున్న వారు మాత్రమే అసెస్‌మెంట్ కోసం వస్తున్నారు. దీంతో గతంలో దళారులతో నిత్యం సందడిగా కనిపించే బల్దియా రెవెన్యూ విభాగం ప్రస్తుతం బోసిపోయి దర్శనమిస్తోంది. ఆ సెక్షన్‌కు సంబంధించిన సిబ్బంది మినహా ఇతరులెవరూ కానరావడం లేదు. పట్టణంలో ఇక బోగస్ అసెస్‌మెంట్లకు పూర్తిగా చెక్ పడినట్లేనా అనే చర్చ సాగుతోంది.

పారదర్శకంగా వ్యవహరిస్తున్నాం



గతంలో ఎలాంటి డాక్యుమెంట్స్ లేకున్నా, రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండానే ఇష్టానుసారంగా అసెస్‌మెంట్ జారీ చేశారు. ప్రస్తుతం వాటి జారీపై ప్రత్యేక నిఘా పెట్టాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవమని నిర్ధారించుకున్నాకే నంబర్లు జారీ చేస్తున్నాం. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా వ్యవహరిస్తున్నాం.
– సీవీఎన్. రాజు, మున్సిపల్ కమిషనర్

అడవి బిడ్డలు.. సంస్కృతి రక్షకులు

- సంప్రదాయాలకు అధిక ప్రాధాన్యత
- యాస.. భాష పరిరక్షణకు చర్యలు
- భావితరాలకు అందించే యత్నం
- నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఇంద్రవెల్లి/ఉట్నూర్‌రూరల్‌: సంస్కృతి, సంప్రదాయాలకు ఆదివాసీ గిరిజనులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. కొండ, కోనల నడుమ ప్రకృతితో మమేకమవుతున్నారు. ప్రకృతిని దైవంగా భావించి జీవనం సాగిస్తున్నారు. తరతరాలుగా వస్తున్న ఆచార, వ్యవహారాలను పాటిస్తూ వాటిని భావితరాలకు అందిస్తున్నారు. ఏ పని చేసినా, ఈ కార్యం తలపెట్టినా ముందుగా ప్రకృతి దేవతలకు పూజలు చేసే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. వనదేవతలకు పూజలు చేశాకే సాగు పనులు ప్రారంభిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో కొలాం, తోటి, నాయక్‌పోడ్‌, గోండు, పర్ధాన్‌, అంధ్‌, లంబాడీ తెగలుగా ఉన్న ఆదివాసీ గిరిజనులు ప్రతీ పండుగ, కుల దేవతల పూజలు, పెళ్లి వేడుకలు ఇలా ఏవైనా వారి సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా వైభవంగా నిర్వహిస్తారు.

ఆదివాసీ తెగలు.. పండుగలు

గోండు, కొలాం, పర్ధాన్‌, తోటి ఆదివాసీ తెగల వారు కుల దేవతలతోపాటు ప్రకృతి దేవతలను ఆరాధిస్తారు. ఏ పూజ చేసినా.. తరతరాలుగా గ్రామస్తులంతా సామూహికంగా చేసే ఆచారాన్ని పాటిస్తున్నారు. ఆషాఢ మాసం ప్రారంభంలో అకాడి (వన దేవత) పూజలతో మొదలుకుని నాలుగు నెలలపాటు యేత్మసుర్‌ దేవతలను ఆరాధిస్తారు. శ్రావణ మాసానికి ముందు గావ్‌ సాత్‌ పేరుతో పోచమ్మ తల్లికి పూజలు చేస్తారు. శ్రావణ మాసంలో నెలపాటు గ్రామ దేవతలు శివ బోడి, నొవోంగ్‌ పూజలను ఘనంగా నిర్వహిస్తారు. దీపావళి సందర్భంగా యేత్మసుర్‌ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గుస్సాడీ వేషధారణలతో వారంపాటు సంప్రదాయ వాయిద్యాల మధ్య దండారీ ఉత్సవాలను ఘనంగా జరుపుకొంటారు. వైశాఖ, పుష్య మాసాల్లో సంవత్సరానికి రెండు సార్లు కులదేవతలైన జంగుబాయి, పెర్సాపేన్‌, భీం దేవుడి పూజలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తారు. పుష్యమాసంలో రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన, రాష్ట్రంలో రెండో పండుగైన నాగోబా మహాపూజ, నాగోబా జాతరను ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా మెస్రం వంశీయులు ఘనంగా నిర్వహిస్తారు. అంధ్‌ సమాజ్‌ ఆదివాసీలు తమ కులగురువు శ్రీశ్రీ సంత్‌ సద్గురు పులాజీబాబాను ఆరాధిస్తారు. వారివారి గ్రామాల్లో నిర్మించిన ధ్యాన్‌ మందిరాల్లో ప్రతీ సంవత్సరం వార్షికోత్సవ పూజలు చేస్తారు. నాగుల పంచమి మరుసటిరోజు శీరల్‌ దేవత ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. అంధ్‌ ఆదివాసీ సమాజ్‌ వారి వివాహాలు పులాజీబాబా ధ్యాన్‌ మందిరాల్లో సామూహికంగా జరిపిస్తారు. నాయక్‌పోడ్‌ ఆదివాసీ భీమన్న దేవుడిని ఆరాధ్యదైవంగా కొలిచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. లంబాడా గిరిజనులు కులగురువు సంత్‌ సేవలాల్‌ మహరాజ్‌ను ఆరాధించడంతో పాటు ప్రతీ సంవత్సరం శ్రావణ మాసంలో రాఖీ పౌర్ణమి తరువాత వారంపాటు తీజ్‌ ఉత్సవాలను ఘనంగా జరుపుకొంటారు. ప్రతిరోజూ గ్రామాల్లోని ఆలయాల్లో సేవాలాల్‌, జగదాంబదేవిని ఆరాధిస్తారు.



ఇంద్రవెల్లి: రాజుల్‌ దేవతకు పూజలు చేస్తున్న ఆదివాసీలు (ఫైల్‌)

వాయిద్యాలు.. ప్రత్యేకతలు

గోండులు పెర్సాపెన్‌ పండుగలో దండారీ డప్పుల దరువులతో తుడుం వాయిద్యాన్ని నిర్వహిస్తుంటారు. కొలాంలు పోలకమ్మ పండుగ, భీమయ్యక్‌ ఉత్సవం (సట్టి దెయ్యాల్‌), దండారీ, దసరా పండుగల్లో మోగిస్తుండగా, గోండులు జంగుబాయి, పెర్సాపెన్‌, దండారీ ఉత్సవాల్లో తుడుంను డోలుకు సహ వాయిద్యంగా మోగిస్తుంటారు. అలాగే డెంసా నృత్యాలు చేస్తుంటారు. ఆదివాసీలకు ఒక తరం నుంచి మరొక తరానికి సంస్కృతి, సంప్రదాయాలు వారసత్వంగా వస్తున్నాయి. తుడుంను పురుషవాద్యంగా భావిస్తారు. ఈ సంగీత వాద్యాన్ని పూజా కార్యక్రమంలో ఉంచి పూజిస్తారు. ఆదివాసీల చైతన్యానికి 'తుడుం' ఒక సంకేతంగా నిలిచింది. ఆదివాసీ ఉద్యమాల్లో ర్యాలీ, ధర్నా లాంటి నిరసన కార్యక్రమాల్లో 'తుడుం' మోగిస్తుంటారు. గోండి పూజారులైన ప్రధాన్లు, తోటి తమ తెగ ఆచారాన్ని పాటిస్తూ జరిపే మత క్రతువులు, కర్మకాండలు, వివాహాలు, చావుల సందర్భంలో దీనిని వాయిస్తారు. గోండి సంప్రదాయాలు, గౌరవానికి ఇది సంకేతం. కిక్రితో పాటు 'పెప్రే' అనే రెండు సన్నాయి వాయిద్యాలు, డక్కి అనే చర్మవాయిద్యం అన్నీ కలిసి సామూహికంగా వాయిస్తారు. డోలు లేని ఆదివాసీ ఊరు ఉండదు. డోలు వాయిద్యానికి ప్రత్యేకమైన జానపద గేయాలు, నృత్యాలు ఉంటాయి. హోలీ, వివాహ వేడుకలకు డోలు నృత్యాలతో కళాకారులు అలరిస్తుంటారు. ఆదివాసీ వ్యక్తి మరణిస్తే అతని దహన సంస్కారాల సందర్భంగా దీనిని వాయిస్తారు. డోలును వివాహ వేడుకల సందర్భంగా రాత్రి వేళ నృత్యాలు చేయడానికి వినియోగిస్తుంటారు. ఒక్కో సందర్భంలో ఒక గ్రామంతో మరో గ్రామం మధ్య పాటల పోటీలు జరుగుతుంటాయి. డోలు వాయిస్తూ పురుషులు స్త్రీ వేషధారణలో, ఒకరు జోకర్‌గా నృత్యాలు చేస్తుంటారు.



ఉట్నూర్‌రూరల్‌: గుస్సాడీ నృత్యం చేస్తున్న ఆదివాసీలు

యాస.. భాషకు డిజిటల్‌ రూపం



ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో ఆదివాసీలు మాట్లాడే యాస.. భాష.. సంస్కృతిని డిజిటల్‌ రూపంలో భద్రపర్చడానికి బోలి చేతో (భాష–చైతన్యం) ఫౌండేషన్‌ కృషి చేస్తోంది. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు చెరిగిపోకుండా భావితరాలకు అందించడానికి గోండి, కొలామీ భాషలో వికీపీడియా, విక్షనరీలను అంతర్జాలంలో భద్రపర్చి భావితరాలకు భాష, సాహిత్య సంపదను అందించడానికి కార్యశాల నిర్వహిస్తూ ఆదివాసీ యువకులను ప్రోత్సహిస్తోంది. – ఆత్రం మోతీరాం, బోలిచేతో ఫౌండేషన్‌ బోర్డు సభ్యుడు

గోండి, కొలామి భాష పరిరక్షణలో..



ఆదిలాబాద్‌ రూరల్‌: మావల మండలం వాఘాపూర్‌ గ్రామానికి చెందిన గిరిజన ఉపాధ్యాయుడు తొడసం కైలాస్‌ గోండీ, కొలామి భాషల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తున్నారు. ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌ (ఏఐ) ఉపయోగించి రోబోటిక్‌ టెక్నాలజీ కంప్యూటర్‌ ద్వారా యాంకర్‌ను తయారు చేసి గోండి భాషలో వార్తలు చదివిస్తున్నారు. గోండి, కొలామి, తెలుగు, హిందీ, ఆంగ్లం, లంబాడా భాషల్లో వందలాది పాటలు రాసి ఏఐలో పొందుపర్చారు. మహాభారత గ్రంథాన్ని తెలుగు లిపితో గోండి భాషలో అనువదించారు. 18 పర్వాలు నాలుగు నెలలపాటు అనువదించి వంద పుస్తకాలు ప్రచురితం చేశారు. మన్‌కీబాత్‌లో పీఎం మోదీ కైలాస్‌ను ప్రశంసించారు. అప్పటి కలెక్టర్లు దివ్యదేవరాజన్‌, దేవసేన, ప్రస్తుత కలెక్టర్‌ రాజర్షిషా కైలాస్‌ను అభినందించారు.

సంస్కృతి, సంప్రదాయాల రక్షణలో..



ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ భవితరాలకు అందించేందుకు పాండి పారీ కుప్పర్‌ లింగో హీరా సుకా దేవతల వేషధారణలతో ఆటపాటలతో మెస్రం రేలా రవి కృషి చేస్తున్నారు. అంతరించిపోతున్న ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగు కాకుండా గోండి ధర్మాన్ని కాపాడుకుంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

క్లుప్తంగా

గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై కేసు



నిందితుడు, గుడుంబాతో ఎక్సైజ్‌ పోలీసులు

దహెగాం: మండలంలోని పీకలగుండం సమీపంలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో గుడుంబా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్‌ సీఐ రవి తెలిపారు. పీకలగుండం సమీపంలో కల్వాడ గ్రామానికి చెందిన అజ్మీర రాములు అనే వ్యక్తి సురేశ్‌కు చెందిన ఆటోలో 20 లీటర్ల గుడుంబా తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. గుడుంబా స్వాధీనం చేసుకుని రాములుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్‌ ఎస్సై లోభానంద్‌, సిబ్బంది సురేశ్‌ ఉన్నారు.

స్వర్ణ ప్రాజెక్ట్‌ గేటు ఎత్తివేత



మూడో గేటు ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

సారంగపూర్‌: మహారాష్ట్రలో గురువారం రాత్రి, శుక్రవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షాలకు స్వర్ణ ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు చేరడంతో అధికారులు మూడో గేటు ఎత్తి దిగువకు నీటిని వదిలారు. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 1,183 అడుగులు (1.484 టీఎంసీలు) కాగా, ఉదయం 6గంటల వరకు ఏకంగా 80వేల క్యూసెక్కులు రావడంతో 1,182.5 అడుగులకు చేరింది. అప్రమత్తమైన అధికారులు ప్రాజెక్ట్‌ మూడో గేటు ఎత్తి అంతే మొత్తంలో దిగువకు నీటిని వదిలారు. ప్రస్తుతం 1,182.5 అడుగుల వద్ద నీటిమట్టం స్థిరంగా ఉంచామని ఏఈ మధుపాల్‌ తెలిపారు.

గడ్డెన్నవాగుకు ఇన్‌ఫ్లో

భైంసాటౌన్‌: ఎగువన కురిసిన వర్షాలకు భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌కు ఇన్‌ఫ్లో వస్తోంది. గురువారం రాత్రి కురిసిన వర్షానికి 1,693 క్యూసెక్కులు వచ్చినట్లు ప్రాజెక్ట్‌ అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్‌ పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా, ప్రస్తుతం 357.60 మీటర్ల నిల్వ ఉంది. ప్రాజెక్ట్‌ కాలువ ద్వారా 40 క్యూసెక్కుల నీటిని ఆయకట్టు పంటల సాగుకు వదులుతున్నారు.

బార్‌ ఉద్యోగిపై దాడిచేసిన వ్యక్తి రిమాండ్‌

ఆదిలాబాద్‌టౌన్‌: బార్‌కు వెళ్లి బిల్లు చెల్లించకుండా గందరగోళం సృష్టించి కౌంటర్‌పై ఉన్న వ్యక్తిపై దాడిచేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్‌ సీఐ సునీల్‌కుమార్‌ తెలిపారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌ చౌక్‌లోగల శివ బార్‌లో ఈనెల 11న ఇచ్చోడకు చెందిన జయవంత్‌రావు, ఆదిలాబాద్‌ పట్టణంలోని న్యూహౌసింగ్‌బోర్డుకు చెందిన సాయినాథ్‌ మద్యం సేవించారు. రూ.1,850 బిల్లు కాగా రూ.1,500 మాత్రమే ఇచ్చి గొడవకు దిగారు. జాదవ్‌ శ్రీనివాస్‌ గ్లాస్‌తో బార్‌ అకౌంటెంట్‌ కలీమ్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో బాధితుడు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా శ్రీనివాస్‌ను అరెస్ట్‌ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

బాలికల గురుకులంలో చొరబడిన నలుగురి అరెస్ట్‌



నిందితుల అరెస్ట్‌ చూపిస్తున్న ఎస్సై రామకృష్ణ

బెల్లంపల్లిరూరల్‌: బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో బుధవారం అర్ధరాత్రి అక్రమంగా చొరబడి విద్యార్థినులను భయభ్రాంతులకు గురిచేసిన నలుగురిని శుక్రవారం తాళ్లగురిజాల పోలీసులు అరెస్ట్‌ చేశారు. తాళ్లగురిజాల ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామానికి చెందిన దుగుట సంజయ్‌, కోనూరి కిరణ్‌, కన్నెపల్లి మండలం చర్లపల్లి, ఎల్లారం గ్రామాలకు చెందిన గొల్లపల్లి కిరణ్‌, కొజ్జన కిరణ్‌ మద్యం మత్తులో బాలికల గురుకుల విద్యాలయంలో అక్రమంగా చొరబడ్డారు. కేకలు వేస్తూ, బూతులు తిడుతూ విద్యార్థినులను భయభ్రాంతులకు గురిచేశారు. అప్రమత్తమైన సిబ్బంది వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా కోనూరి కిరణ్‌ పట్టుబడగా ముగ్గురు పారిపోయారు. అక్రమంగా విద్యాలయంలో చొరబడిన ఘటనపై విద్యాలయ ప్రిన్సిపాల్‌ నిరుపమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి నలుగురు నిందితులను అరెస్ట్‌ చేసినట్లు ఎస్సై తెలిపారు. మద్యం, గంజాయి మత్తులో యువత ఇష్టారీతిన వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. రాత్రి వేళ అనుమానాస్పదంగా తిరిగి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. రాత్రి వేళ గస్తీ, భద్రతను ముమ్మరం చేసినట్లు తెలిపారు.

పోడు కోసం పోరు



శ్రీరామ జిన్నింగ్‌ ఆవరణలో సేద తీరుతున్న రైతులు

తాండూర్‌: దశాబ్దాలుగా పోడు భూములు సాగుచేసుకుంటున్న తమకు వాటిపై హక్కులు కల్పించాలని రైతులు పోరుబాట పట్టారు. కుమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లా చింతలమానేపల్లి మండలం దిందా గ్రామానికి చెందిన సుమారు 40మంది రైతులు మూడురోజుల క్రితం చేపట్టిన పాదయాత్ర గురువారం రాత్రి తాండూర్‌కు చేరుకుంది. మండలంలోని రేపల్లెవాడ సమీపంలోని శ్రీరామ జిన్నింగ్‌ మిల్లులో సేద తీరిన అనంతరం శుక్రవారం తెల్లవారుజామున రైతులు తమ పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దశాబ్దాలుగా గ్రామ శివారులోని సుమారు 1,200 ఎకరాలను సాగు చేసుకుంటూ 600 కుటుంబాలవాళ్లం జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది అటవీశాఖ అధికారులు వాటిని సాగు చేసుకోకుండా అడ్డుకున్నారని వాపోయారు. తమకు న్యాయం చేసి భూ హక్కు పత్రాలు ఇచ్చేలా చూడాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. హైదరాబాద్‌ వరకు పాదయాత్ర నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి, అటవీశాఖ మంత్రి, అధికారులకు తమ గోడు చెప్పుకొంటామని వారు పేర్కొన్నారు.

ట్రాక్టర్‌ ట్రాలీని ఢీకొని ఒకరి మృతి



యశ్వంత్‌ మృతదేహం

భైంసారూరల్‌: భైంసా–నిర్మల్‌ జాతీయ రహదారి మాటేగాం సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ ట్రాలీని ద్విచక్రవాహనంతో ఢీకొని యశ్వంత్‌ (21) అనే యువకుడు దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పేండ్‌పెల్లి గ్రామానికి చెందిన యశ్వంత్‌, కుంసర గ్రామానికి చెందిన విలాస్‌ శుక్రవారం భైంసాకు వచ్చారు. పనులు ముగించుకుని భైంసా నుంచి ద్విచక్రవాహనంపై పేండ్‌పెల్లికి వెళ్తున్నారు. మాటేగాం గ్రామ సమీపంలో రోడ్డుపై ట్రాక్టర్‌ ట్రాలీ పంక్చర్‌ కావడంతో అక్కడే నిలిపి ఉంచారు. రోడ్డుపై ఉన్న ట్రాలీని వీరు ద్విచక్రవాహనంతో ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గాయాలపాలైన క్షతగాత్రులను 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా పేండ్‌పెల్లికి చెందిన యశ్వంత్‌ మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సచిన్‌ (ఫైల్‌)

కుభీర్‌: మండలంలోని పార్డి (బీ) గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రంగశివుని తండాకు చెందిన పవార్‌ సచిన్‌ అనే యువకుడు మృతి చెందాడు. ఎస్సై కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సచిన్‌ తన బైక్‌పై సాయంత్రం కుభీర్‌ సంతకు వస్తుండగా పార్డి(బీ) సమీపంలో పంది తగిలి క్రిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం అతడిని భైంసాకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. అతడి భార్య సిమ్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతోపాటు కూతురు, తల్లితండ్రులు ఉన్నారు.

గడ్డి మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

భైంసారూరల్‌: మండలంలోని బడ్‌గాం గ్రామానికి చెందిన షానే మరీబా (84) అనే వృద్ధుడు గడ్డి మందు తాగి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. షానే మరీబా భార్య ఏడాది క్రితం మృతి చెందింది. అప్పటినుంచి కుమారుడి వద్ద ఉంటున్నాడు. ఒంటరి తనం భరించలేక జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు వెంటనే భైంసా ఏరియాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుమారుడు పరమేశ్‌ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో మహిళ..

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌ ప్రసన్నాంజనేయనగర్‌కు చెందిన గంగాధరి వాణి(44) అనే మహిళ అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. 20 ఏళ్ల క్రితం దేవాపూర్‌కు చెందిన శంకర్‌తో వాణి వివాహం జరిగింది. కొంతకాలంగా శంకర్‌ మద్యానికి బానిసయ్యాడు. దీంతో వాణి టైలరింగ్‌ పని చేస్తూ ఇంటి భారాన్ని మోసింది. తనకు వచ్చే డబ్బులు సరిపోకపోవడం, అప్పులు ఉండడంతో మనోవేదనకు గురై ఈనెల 6న మధ్యాహ్నం పురుగుల మందు తాగింది. గమనించిన భర్త వెంటనే గ్రామంలోని కంపెనీ ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. పరిస్థితి విషమించగా కరీంనగర్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయిస్తుండగా రాత్రి మృతిచెందింది. మృతురాలికి 11 ఏళ్ల కొడుకు విజ్ఞతేజ్‌ ఉన్నాడు. మృతురాలి తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.